ప్రజా పత్రిక

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



డిసెంబర్ 5న సికింద్రాబాద్ నుంచి కాశీ, అయోధ్యలకు 'భారత్ గౌరవ్' రైలు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 79 | మంగళవారం 24 - 11 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2

ఫేసియల్ రికగ్నిషన్‌తో
గ్లోబల్ సమ్మిట్

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు
- కార్యక్రమ ఏర్పాట్లు, విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు
- ఫేసియల్ రికగ్నిషన్‌తో గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులకు ప్రవేశం
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్ :

గ్లోబల్ సమ్మిట్ 2026కు రానున్న ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది హెచ్చరించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై బోధి పెవెలియన్‌లో సమీక్ష చేశారు. ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధులకు ప్రవేశం కల్పించాలని తెలిపారు.డెలిగేట్లతో అత్యంత మర్యాదగా వ్యవహరించేలా విధుల్లో ఉన్న అధికారులకు శిక్షణ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు, మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు అతిథుల కోసం ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మక్క సారలమ్మ ఆలయంలోని తోరణాల నమూనాలను గ్లోబల్ సమ్మిట్‌లో ఉపయోగించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. సమ్మిట్‌లో భాగంగా - మిగతా 2 లో



కేటీఆర్ ఊహా ప్రపంచంలో
బతుకుతున్నారు

- భట్టి ఘాటు వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఇక కలేనన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కేటీఆర్ వాస్తవాలు పదిలేసి సోషల్ మీడియా లోకంలోనే ఉంటున్నారని వ్యాఖ్య
- తమ గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోందన్న విమర్శ

హైదరాబాద్ :

తెలంగాణలో ప్రజలకు సంక్షేమం అందిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల - మిగతా 2 లో

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు
రూ.1,115 కోట్ల కేటాయింపు



- గోదావరి పుష్కరాల లోగో డిజైన్ పర్క్ షాప్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు
- ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు
- 2027 జూన్ 26 నుంచి జులై 07 తేదీ వరకు 77 ప్రాంతాల్లో ఘనంగా పుష్కరాలు

హైదరాబాద్ :

గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనపై ఇవాళ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో - మిగతా 2 లో



సూరత్-బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు ట్రయల్ రన్

- కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కీలక అప్‌డేట్
- మే 2027లో సూరత్-బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు ట్రయల్స్
- గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న బి-28 రైలు
- 2029 నాటికి థానే వరకు విస్తరించనున్న సేవలు
- 508 కిలోమీటర్ల మేర శరవేగంగా సాగుతున్న ప్రాజెక్టు పనులు

ఢిల్లీ :

దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు మరో కీలక మైలురాయికి చేరుకుంది. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య గల 50 కిలోమీటర్ల మార్గంలో 2027 మే నెలలో ప్రయోగాత్మక పరీక్షలు (ట్రయల్ రన్స్) ప్రారంభం కానున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో హైస్పీడ్ రైలు వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరీక్షలు జరగనున్న మొట్టమొదటి మార్గం ఇదే కావడం విశేషం.ఈ మార్గానికి సంబంధించి విద్యుద్దీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని రైల్వే మంత్రి తెలిపారు. ఎలివేటెడ్ ట్రాక్‌పై ఉన్న అప్, డౌన్ లైన్లకు నవంబర్ 20న విజయవంతంగా విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ కారిడార్ కోసం అత్యాధునిక 2ఞ25 కేవీ ట్రాక్షన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బిలిమోరా వద్ద ట్రాక్షన్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఇక ఈ సెక్షన్‌లో మిగిలి ఉన్న సిగ్నలింగ్ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టును దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అహ్మదాబాద్ నుంచి వాపీ వరకు ఉన్న విభాగాన్ని 2027 చివరి నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అనంతరం 2029 నాటికి ఈ సేవలను మహారాష్ట్రలోని థానే వరకు విస్తరించనున్నారు. దేశంలో మొట్టమొదటి కమర్షియల్ హైస్పీడ్ రైలు సర్వీస్ 2027 చివరి త్రైమాసికంలోనే ప్రారంభం - మిగతా 2 లో

నేపాల్ అభివృద్ధికి రూ.24 వేల కోట్ల
ఆర్థిక సాయం



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యం
- భారత్-నేపాల్ ప్రధానుల సంయుక్త ప్రకటన చేశారు
- ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బాలేందర్ షా సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నారు

ఢిల్లీ :

నేపాల్‌లో అభివృద్ధి పనులకు భారత్ రూ. 24 వేల కోట్ల సాయం అందించనుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యంగా భారత్‌లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని బాలేంద్ర షా దిల్లీలోని - మిగతా 2 లో



పాకిస్థాన్‌లో తీవ్ర
గ్యాస్ సంక్షోభం

- వంట చేసుకోలేక ప్రజల అవస్థలు
- వంట గ్యాస్ కొరతతో ఆకాశాన్నంటిన ఎల్పీజీ ధరలు
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో కిలో ఎల్పీజీ ధర 600 రూపాయలకు పైగా పెంపు
- గ్యాస్ దొరక్క వంట కోసం కట్టెలు, బొగ్గు వాడుతున్న నగరవాసులు

ఢిల్లీ :

పాకిస్థాన్‌లో గ్యాస్ సంక్షోభం రోజురోజుకు తీవ్ర తరమవుతోంది. ముఖ్యంగా ఖైబర్ - మిగతా 2 లో

విశాఖలో
ఆసియాన్-ఇండియా సదస్సు



- బ్లూ ఎకానమీపై నారా లోకేశ్ కీలక ప్రసంగం
- విశాఖలో ఘనంగా ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు
- ఏపీని గ్లోబల్ మారిటైమ్ గేట్‌వేగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్
- రాష్ట్రంలో శరవేగంగా నాలుగు నూతన పోర్టుల నిర్మాణం

వెస్ట్ బెంగాల్ పేరు
పశ్చిమ్ బంగా!

- వెస్ట్ బెంగాల్ పేరు మార్పునకు రంగం సిద్ధం
- వెస్ట్ బెంగాల్ పేరును పశ్చిమ్ బంగాగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం
- డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారికంగా తీర్మానం ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- జాతీయ సదస్సుల్లో ప్రాధాన్యత దక్కేందుకే అక్షర క్రమం మార్పు - మిగతా 2 లో

13 కార్పొరేషన్లలో కొలువుదీరిన
కొత్త పాలకవర్గాలు

- అట్టహాసంగా సాగిన ప్రమాణ స్వీకారాలు
- ఏపీలో 13 నగర పాలక సంస్థలకు సంబంధించి , మేయర్లుకార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు
- అనంతరం డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకున్నారు
- విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా ప్రమాణ స్వీకారం



అమరావతి :

ఏపీలో తొలివిడతలో ఎన్నికలు జరిగిన 13 మున్సిపల్ కార్పొరేషన్లలో కొత్త పాలకవర్గాలు ఇవాళ కొలువుదీరాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు మేయర్లు, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. సభ్యుల ప్రమాణ స్వీకార ప్రక్రియ ముగిసిన వెంటనే డిప్యూటీ మేయర్లను పరోక్ష పద్ధతిలో చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇవాళ్టి నుంచే సభ్యుల పదవీకాలం ఐదేళ్ల పాటు ఉండనుంది.విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం 1. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా జనసేన నేత వంగవీటి రాధాకృష్ణ ప్రమాణం చేశారు. ఈ మేరకు వీఎంసీ కార్యాలయంలో అభిమానులు, కూటమి కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత నగరంలోని 86 వార్డుల కార్పొరేటర్ల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. విజయవాడ నగర ప్రథమ పౌరుడిగా వంగవీటి ప్రమాణం చేయడంతో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా 12వ వార్డు సభ్యులు చెన్నుపాటి కాంతిశ్రీ - మిగతా 2 లో

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత
నిర్ణయాలే కీలకం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ సమీక్ష
- వైద్యం వ్యవసాయ రంగాల్లో ఏఐ వినియోగానికి సీఎం ఆదేశం
- ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టీకరణ
- డేటా ఆధారిత నిర్ణయాలతోనే పాలనలో మెరుగైన ఫలితాలు అని వెల్లడి
- ఉద్యోగుల పనితీరు పెంపునకు ప్రత్యేక శిక్షణ

అమరావతి :

వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు అన్ని కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని పాలనలో మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. - మిగతా 2 లో

సంపాదకీయం

ముగ్గురి ముచ్చట్లు...!

మూడు అతిపెద్ద అణ్వాయుధ దేశాల అధినేతలు ఒకే వేదికమీదకు రావడం, ఎదురెదురుగా కూర్చొని గంటన్నరకు పైగా మాట్లాడుకోవడం ఒక వింత. రెండో ప్రపంచయుద్ధం తరువాత అమెరికా, రష్యా, చైనా అధినేతల తొలి త్రైపాక్షిక భేటీ ఇది. ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ సంక్షోభం, ఎడతెరిపి లేకుండా సాగుతున్న వాణిజ్య యుద్ధాల కాలంలో ఈ అగ్రరాజ్యాధినేతల మధ్య నేరుగా సంభాషణ జరగడం ఒక కీలక ఘట్టం. ప్రపంచాధిపత్యం కోసం పోటీపడుతున్న రెండు ఆర్థికశక్తుల నుంచి పరస్పర సహకారం, ఇచ్చిపుచ్చుకోవడం వంటి మాటలు రావడం వినసొంపుగా ఉంటుంది. నాలుగు అంశాల 'శాంతి ప్రకటన' తాత్కాలికంగానైనా ఓదార్పునిస్తుంది.ఈ ముప్పిరి భేటీని 'యాల్టా 2.0' అన్నారు కొందరు. ఆర్భాటం ఎక్కువ, ఫలితం తక్కువ అని పెదవి విరిచారు మరికొందరు. రష్యా, చైనా అధ్యక్షులతో అమీతుమీ తేల్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నా, ట్రంప్ లక్ష్యం అది కాదు కాబట్టే ఈ భేటీ అంత ఘనంగా, సవ్యంగా సాగిపోయిందన్నవారూ ఉన్నారు. మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బతిని, ఇంట ఓడిన ఆయన రచ్చ గెలవాలనుకోవడం సహజం. మూడురోజుల ఆసియా పర్యటన, అందులో రెండు సదస్సులు, ఈ త్రైపాక్షిక భేటీ ఆయనకు ఉపశమనం కలిగిస్తాయి. జిన్‌పింగ్ ఆదరణ, ఆ హడావుడి, అట్టహాసం, వేలాదిమంది ఘనస్వాగతం తన పర్యటన విజయవంతమైందని చెప్పడానికి నిదర్శనాలన్నారాయన వెనక్కు తిరిగి వెడుతూ. ఇంతకు మించి ఆయన కోరుకున్నది ఏమీ లేదు. జిన్‌పింగ్‌ను ఆలింగనం చేసుకోవడం, పుతిన్‌ను క్లోజ్‌ఫ్రెండ్ అనడం అమెరికా రాజకీయ విశ్లేషకులకు మాత్రం ఆగ్రహం కలిగించింది. భౌగోళిక రాజకీయ ప్రత్యర్థులను ఇలా ఆకాశానికి ఎత్తేయడం, ఒక ప్రపంచవేదికమీద రష్యాను అమెరికాతో సమానం చేయడం విమర్శలకు తావిస్తోంది. మధ్యంతర ఎన్నికల్లో ఓడిన అమెరికా గతకాలపు అధ్యక్షులు కూడా ఇలా విదేశీపర్యటనలు చేసినవారే. అయితే, వ్యక్తిగతంగా కానీ, దేశానికి కానీ ఎక్కువకాలం ఆ ప్రయోజనాలు నిలబడలేదని కొందరు గుర్తుచేస్తున్నారు.ఈ భేటీ వెనుక ఎవరి ప్రయోజనాలు వారివి. అమెరికా, రష్యా అధినేతలను పిలిచి, వారి మధ్య నిలబడి, ప్రపంచ రాజకీయాలకు తానే కేంద్రబిందువు అనిపించుకున్నారు జిన్‌పింగ్. అమెరికాతో ఘర్షణపడకుండా చైనా విస్తరణ, ఆధిపత్యం కొనసాగితే చాలు ఆయనకు. పాశ్చాత్యదేశాలన్నీ తనను ఒంటరి చేసినా, ఈ ఇద్దరితో సమానంగా గౌరవాన్ని అందుకుంటూ, రష్యా ఇప్పటికీ ఎప్పటికీ అగ్రరాజ్యమేనన్న గుర్తింపు పుతిన్‌కు దక్కింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పరిధిని కట్టడి చేయాలన్న అంశాన్ని ఉమ్మడి ప్రకటనలో చేర్చడం ఆయనకు మరింత ఓదార్పును ఇచ్చింది. ఇజ్రాయెల్ మాజీ ప్రధాని నెతన్యాహూకు కూడా ఈ హేగ్ కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది కనుక ట్రంప్‌కు కూడా అదంటే ఎలాగూ గిట్టదు. ప్రపంచదేశాల ప్రయోజనాలు, చమురు ధరల స్థిరత్వం పేరిట చేసిన నిర్ణయాలు, ప్రమాణాలూ రష్యాకే అధికంగా ఉపకరిస్తాయి కనుక పుతిన్‌కు ఇక అడ్డంకులు లేనట్టే. రష్యా చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటున్న ఉక్రెయిన్‌కు ఇంధన భద్రత అన్నమాట ఒక హెచ్చరిక.ఐదేళ్ళుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం, ఏడాదికి చేరువవుతున్న ఇరాన్ యుద్ధం ఇటువంటి భేటీల తరువాత ముగిసిపోతాయన్న భ్రమ ఎవరికీ లేదు.

13 కార్పొరేషన్లలో కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

మొదటిపేజీ తరువాయి - ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు కావాల్సిన కోరం ఉండటంతో కార్యక్రమాన్ని కొనసాగించిన ప్రిసైడింగ్ అధికారి ఉదయం 10 గంటల వరకూ డిప్యూటీ మేయర్ స్థానానికి కేవలం ఒకే అభ్యర్థిత్వం ఉన్నట్లు ప్రకటించారు. మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం అనంతరం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కార్యక్రమాన్ని చేపట్టగా కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు చెన్నుపాటి కాంతిశ్రీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా 4వ డివిజన్ కార్పొరేటర్ దేవానంద్ కాంతిశ్రీ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. దీంతో చెన్నుపాటి కాంతిశ్రీ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ప్రకటించి ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

2. విజయనగరం నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా అవనాపు భార్గవి, డిప్యూటీ మేయర్‌గా ప్రసాదుల రజని బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారానికి ముందు మేయర్ భార్గవి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్పొరేటర్లతో కలిసి టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు తేజ్ భరత్ పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి నూతన పాలకవర్గంతో ప్రమాణం చేయించారు. అనంతరం 25వ వార్డు టీడీపీ కార్పొరేటర్ ప్రసాదుల రజని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

3. ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ కొలువుదిరింది. 62 మంది కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ రెడ్డి అప్పలనాయుడు మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్ మేయర్, కార్పొరేటర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రెడ్డి అప్పలనాయుడును కార్పొరేటర్లు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఘనంగా సన్మానించారు.

4. మచిలీపట్నం మేయర్, కార్పొరేటర్ల ఎన్నిక అట్టహాసంగా జరిగింది. మచిలీపట్నం కార్పొరేషన్ సమావేశ భవనంలో నగరపాలక సంస్థ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరేట్ డీకే బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత, మేయర్ అబ్దుల్ అబీదా ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం వరుస క్రమంలో 60మంది కార్పొరేటర్లు చేత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం, కొట్టె వెంకటరావుని డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

5. గుంటూరు మేయర్‌గా కోవెలమూడి లక్ష్మీఅపర్ణ ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా యర్రంశెట్టి రాజేశ్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అనంతరం లక్ష్మీఅపర్ణ, రాజేశ్‌తో పాటు కార్పొరేటర్లతో కలెక్టర్ సాయికాంత్ వర్మ ప్రమాణం చేయించారు.

6. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను ఆ పార్టీ కైవసం చేసుకుంది. మేయర్‌గా నల్లమల్లి శ్రీశిల్ప ప్రత్యర్థిపై భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా చావలి చార్వాక ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 62 డివిజన్లున్న ఒంగోలు కార్పొరేషన్‌లో తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన 24 ఏళ్ల చార్వాక డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవడం విశేషం. చిన్న వయసులోనే కీలక బాధ్యతలు చేపట్టిన ఆమె విజయం యువత రాజకీయాల వైపు అడుగులు వేసేందుకు స్ఫూర్తిగా నిలవనుంది.

7. నెల్లూరు నగర పాలక సంస్థ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. మేయర్‌గా ఎన్నికైన రూప్ కుమార్ యాదవ్‌తోపాటు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో ప్రిసైడింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతం డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించగా బీజేపీకి చెందిన 60వ డివిజన్ కార్పొరేటర్ రఘునాథరాజు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు రూప్ కూమార్‌ను మేయర్ సీటులో కూర్చోపెట్టారు. అందరి సహకారంతో నెల్లూరులో అభివృద్ధి చేస్తామని వారు ప్రకటించారు.

8. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ గా మన్నెం శ్రీనివాసప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. తిరుపతి ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు 66 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్లు, మేయర్ అభ్యర్థి శ్రీనివాసప్రసాద్‌తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

9. చిత్తూరు మేయర్‌గా కఠారి హేమలత డిప్యూటీ మేయర్‌గా గోపీనాథ్ బాధ్యతలు స్వకరించారు. వారిద్దరితో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

10. వైఎస్సార్ కడప నగరపాలక సంస్థ మేయర్‌గా సువర్ణ ప్రమాణస్వీకారం చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మేయర్ సహా కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. డిప్యూటీ మేయర్‌గా టీడీపీ కార్పొరేటర్ మన్సూర్ ఆలీఖాన్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సహా టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11. కర్నూలు నగరపాలక సంస్థ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు మేయర్ బొల్లెద్దుల ప్రత్యూష తొలుత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత డిప్యూటీ మేయర్‌గా బీజేపీ కార్పొరేటర్ అంబలి కాశీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు.

12. అనంతపురం కార్పొరేషన్‌లో 62 డివిజన్ల నుంచి గెలుపొందిన కార్పొరేటర్లు, నగర మేయర్‌గా రమేశ్‌బాబు ప్రమాణం స్వీకారం చేసి పదవులు చేపట్టారు. ఈ మేరకు వారితో ఈ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రమాణం చేయించారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం టీడీపీ నుంచి టి. స్వాతి నామినేషన్ దాఖలు చేసి, బీ-ఫారం అందించారు. డిప్యూటీ మేయర్ పదవికి కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్‌కు ముందుకు రాకపోవడంతో స్వాతిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆనంద్ ప్రకటించారు. అనంతరం ఆమెతో డిప్యూటీ మేయర్‌గా ప్రమాణం చేయించారు.

13. మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్‌గా ముక్కా శ్రావణి ప్రమాణ స్వీకారంలో పాల్గొనలేదు. ఆమె తండ్రి ముత్యాలనాయుడు ఈ నెల 20న కన్నుమూశారు. శ్రావణి విజ్ఞప్తి మేరకు పాలకవర్గం ఏర్పాటైన మొదటి మూడు నెలల్లో లేదా మొదటి మూడు కౌన్సిల్ సమావేశాల్లో ఆమె మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయొచ్చని ఎస్ఈసీ ఉత్తర్వులిచ్చింది.దీంతో విశాఖ డిప్యూటి మేయర్‌గా పందిరి శివవెంకట ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన ఆయణ్ని ఎంపీ శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించారు. ఇందుకు సభ్యులు ఆమోదం తెలపడంతో శివవెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అంతకుముందు కార్పొరేటర్లందరితో జీవీఎంసీ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయించారు.

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే కీలకం

మొదటిపేజీ తరువాయి - ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ స్టాక్ సాయంతో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, ఆయా శాఖల పనితీరును, ప్రభుత్వ ఆదాయాలను మెరుగుపర్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పాలనా విభాగాల్లో రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను విశ్లేషించి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలు (డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్) అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సమర్థ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని గుర్తుచేశారు.ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా చేరవేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తికరమైన సానుకూల అభిప్రాయం ఏర్పడినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని సీఎం అధికారులకు తేల్చిచెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పర్యవేక్షణ లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని, ప్రతి శాఖ కూడా తన పనితీరును నిరంతరం సమీక్షించుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, ఆర్థిక, పురపాలక, ఇంధన శాఖల ఉన్నతాధికారులు మరియు ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బుల్లెట్ రైలు ట్రయల్ రన్ కు ముహూర్తం ఫిక్స్

మొదటిపేజీ తరువాయి - అవుతుందని మంత్రి వివరించారు.ప్రారంభ దశలో నిర్వహించే ట్రయల్స్ కోసం ప్రత్యేకంగా 'బి-28' రైలును వినియోగించనున్నారు. ఈ రైలు గరిష్ఠంగా గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేశారు.సాధారణంగా గంటకు 240 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్లే రైళ్లను హైస్పీడ్ కేటగిరీగా పరిగణిస్తారు. వీటికి అత్యున్నత ఇంజనీరింగ్, కఠినమైన నిర్మాణ ప్రమాణాలు తప్పనిసరి. ఇంతటి అమిత వేగంతో దూసుకెళ్లే సమయంలో ఉత్పన్నమయ్యే గాలి పీడనాన్ని రైలు బోగీలు, ట్రాక్ మౌలిక వసతులు తట్టుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బి-28 రైలు ఇప్పటికే క్లిష్టమైన 'స్క్వీజ్ టెస్ట్'ను విజయవంతంగా అధిగమించిందని మంత్రి చెప్పారు. సాధారణ పరిస్థితుల కంటే రెండు రెట్ల వాతావరణ పీడనాన్ని సైతం తట్టుకునే సామర్థ్యాన్ని ఈ రైలు నిరూపించుకుందని ఆయన తెలిపారు.మరోవైపు మహారాష్ట్ర పరిధిలోని పనులు కూడా వేగంగా పురోగతి సాధిస్తున్నాయని, ముఖ్యంగా సముద్రగర్భ సొరంగం (అండర్‌సీ టన్నెల్) నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి వెల్లడించారు. మొత్తం 508 కిలోమీటర్ల నిడివితో నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టు ద్వారా దేశ ఆర్థిక కేంద్రాలైన ముంబై, అహ్మదాబాద్ నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఇక కేవలం ఆలోచనలకే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటూ పట్టాలెక్కే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

పాకిస్థాన్‌లో తీవ్ర గ్యాస్ సంక్షోభం

మొదటిపేజీ తరువాయి - పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలోని సుయ్ గ్యాస్ (పైప్‌లైన్ గ్యాస్) సరఫరాలో భారీ కోతలు విధించడంతో వంట చేసుకోవడానికి కూడా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ద్రవ్యోల్బణం, ప్రత్యామ్నాయ ఇంధనమైన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) ధరలు ఆకాశాన్నంటడం వారిని మరింత కుంగదీస్తోంది.'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో గ్యాస్ కొరత తీవ్ర స్థాయికి చేరింది. ఇళ్లలో గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఎల్పీజీ సిలిండర్ల వాడకం ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగి, కిలో ఎల్పీజీ ధర 380 పాకిస్థానీ రూపాయల నుంచి 600 రూపాయలకు చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధర 620 రూపాయల వరకు పలుకుతోంది. మరోవైపు, సీఎన్‌జీ కోసం పెషావర్‌లోని బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. సీఎన్‌జీ దొరక్క ఆటో రిక్షా డ్రైవర్లు కూడా ఎల్పీజీ వాడటం మొదలుపెట్టడంతో డిమాండ్, ధరలు మరింత పెరుగుతున్నాయి.ఈ గ్యాస్ కష్టాలు కేవలం ఖైబర్ పఖ్తుంఖ్వాకే పరిమితం కాలేదు. ఇస్లామాబాద్, రావల్పిండి వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 'ఆయిల్ అండ్ గ్యాస్ రెగ్యులేటరీ అథారిటీ' (ఓజీఆర్ఏ) కిలో ఎల్పీజీ ధరను 279 రూపాయలుగా నిర్ణయించినప్పటికీ, డీలర్లు 600 రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్యాస్ కొరత, ధరల పెరుగుదలతో చాలా కుటుంబాలు వంట కోసం కట్టెలు, బొగ్గును ఆశ్రయిస్తున్నాయని 'డాన్' పత్రిక వెల్లడించింది."రోజుకు కేవలం ఆరు గంటలు, అదీ ఉదయం 7 నుంచి 9, మధ్యాహ్నం 12 నుంచి 2, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు మాత్రమే గ్యాస్ వస్తోంది" అని ఓ స్థానికుడు వాపోయాడు. పరిస్థితి మరింత దారుణంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని, ఎల్పీజీ ధరలను నియంత్రించి, అధిక ధరలకు అమ్ముతున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వెస్ట్ బెంగాల్ పేరు పశ్చిమ్ బంగా!

మొదటిపేజీ తరువాయి - పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పేరును మార్చేందుకు అక్కడి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆంగ్ల నామమైన 'వెస్ట్ బెంగాల్' స్థానంలో బెంగాలీ పేరైన 'పశ్చిమ్ బంగా'ను అధికారికంగా ఖరారు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారిక తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు.కోల్‌కతాలోని సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీ అనంతరం సీఎం వివరాలు వెల్లడించారు. "ఇకపై ఆంగ్లంలో కూడా రాష్ట్రాన్ని 'పశ్చిమ్ బంగా' అనే పిలుస్తారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని డిసెంబర్ 9న అసెంబ్లీలో ప్రవేశపెడతాం. సభ ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటరీ, చట్టపరమైన ప్రక్రియల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పేరు మార్పు వెనుక బలమైన పాలనాపరమైన కారణం కూడా ఉంది. ప్రస్తుత పేరు ఆంగ్ల అక్షరమాల ప్రకారం 'బె' (బైవర్ దీవఅస్త్రుశ్రీ)తో ప్రారంభమవుతోంది. దీనివల్ల జాతీయ స్థాయి సమావేశాలు, ముఖ్యమంత్రుల సదస్సులలో బెంగాల్ ప్రతినిధులకు చివరి వరుసలో మాట్లాడే అవకాశం వస్తోంది. దీనివల్ల సమయం సరిపోక రాష్ట్ర వాణిని బలంగా వినిపించలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించి, అల్ఫాబెటికల్ జాబితాలో ముందు వరుసలోకి వచ్చేలా 'ఏ'తో మొదలయ్యేలా 'పశ్చిమ బంగా' పేరును ఖరారు చేశారు. అసెంబ్లీలో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ సవరణ కోసం కేంద్ర ఆమోదానికి పంపనున్నారు.

విశాఖలో ఆసియాన్-ఇండియా సదస్సు

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సముద్ర వాణిజ్యం, పారిశ్రామిక రంగానికి ప్రధాన గేట్‌వేగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో ఇండియా ఫౌండేషన్, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సముద్ర మార్గాల అనుసంధానత, సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఆగ్నేయాసియా దేశాలతో ఆంధ్రప్రదేశ్ బలమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని ఆయన తెలిపారు.విశాఖపట్నానికి గొప్ప సముద్ర చరిత్ర ఉందని, ఈ నగరం తూర్పు నౌకా దళానికి (ఈస్టర్న్ నేవల్ కమాండ్) ప్రధాన కేంద్రంగా ఉండటంతో పాటు శరవేగంగా ఐటీ, వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. దేశంలోనే రెండో అతిపెద్ద తీరప్రాంతం (దాదాపు 1,053 కిలోమీటర్లు) కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు 91.17 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించి దాదాపు 10 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు సృష్టించిందని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రంలో సముద్ర రవాణా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడలలో నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని లోకేశ్ తెలిపారు. ఈ పోర్టులు ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అలాగే తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో దాదాపు రూ. 30,000 కోట్ల భారీ పెట్టుబడితో ప్రధాన షిప్‌బిల్డింగ్ (నౌకా నిర్మాణ) క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలోనే విశాఖ కేంద్రంగా పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, ప్రత్యేక టెర్మినల్స్, షిప్ రిపేరింగ్ రంగాల్లో రూ. 7,500 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు (వీశీఖం) కుదిరాయని తెలిపారు. పోర్టులను పరిశ్రమలతో అనుసంధానించడం, తద్వారా ఆ పరిశ్రమల ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్లకు చేర్చడమే తమ వ్యూహమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను లోకేశ్ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం బ్లూ ఎకానమీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు. సాగరమాల, మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 వంటి బృహత్తర కార్యక్రమాలు దేశ ప్రగతికి బాటలు వేస్తున్నాయని చెప్పారు. నౌకా నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర కేబినెట్ రూ. 25,000 కోట్ల డెవలప్‌మెంట్ ఫండ్‌తో కలిపి మొత్తం రూ. 70,000 కోట్ల భారీ ప్యాకేజీని ఆమోదించిందని గుర్తుచేశారు. దేశీయ వాణిజ్యంలో 95 శాతం సరుకు రవాణా సముద్ర మార్గం ద్వారానే జరుగుతున్నందున, అత్యాధునిక పోర్టుల నిర్మాణం ద్వారా వ్యాపార, పారిశ్రామిక రంగాలకు, ముఖ్యంగా యువత ఉపాధికి విస్తృత అవకాశాలు లభిస్తాయని లోకేశ్ స్పష్టం చేశారు.

నేపాల్ అభివృద్ధికి రూ.24 వేల కోట్ల ఆర్థిక సాయం

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్ హౌజ్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. భారత్- నేపాల్ భాగస్వామ్యంతో చేపట్టే అనేక ప్రాజెక్టులపై ఇరుదేశాల నేతలు చర్చించారు. రైలు, రోడ్డు కనెక్టివిటీ వంటి ప్రాజెక్టులకు సంబంధించి పలు ఒప్పందాలు చేసుకున్నట్లు భేటీ తర్వాత మోదీ, బాలేంద్ర సంయుక్తంగా ప్రకటించారు.నేపాల్‌లో స్టార్టప్ ఇంక్యుబేటర్, ఐఐటీ హబ్ ఏర్పాటు చేస్తామన్న మోదీ ఝాపా ప్రాంతంలో గ్రీన్ ఆయిల్ స్టోరేజ్ టెర్మినల్ నిర్మిస్తామని తెలిపారు. మోతిహరీ పైప్‌లైన్ ప్రాజెక్టు సహా బన్బాసా ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు నేపాల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. మహాకాళి నదిపై మోటరబుల్ వంతెన నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు మోదీ వివరించారు. అనంతరం ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లిన ఇరుదేశా

జర్నలిస్టులకు ప్రత్యేక పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి



ఎల్కతుర్తి, నవంబర్ 23 (ప్రజా మంటలు): తెలంగాణ జర్నలిస్టులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించేలా ప్రత్యేక పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి జర్నలిస్టుల ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.తెలంగాణ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీయూడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు ఆధ్వర్యంలో అందించిన వినతిపత్రంలో ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రకటనల ఆదాయంలో 10 శాతం నిధికి కేటాయించాలని, ప్రభుత్వం అదనంగా 3 శాతం మ్యాచింగ్ గ్రాంట్ అందించాలని కోరారు. నిధుల నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా, పారదర్శక పర్యవేక్షణ, ఏటా ఆడిట్ నిర్వహించాలని సూచించారు.మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులతో పాటు సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వర్తించేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విధానం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాసనసభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే--143 అధ్యక్షుడు గూడూరి కొండల్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కామిని రవీందర్, సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా శతజయంతి వేడుకలు



జగిత్యాల, నవంబర్ 23 (ప్రజా మంటలు): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ముగింపు వేడుకలను పురస్కరించుకుని జగిత్యాల శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.దీనజన సేవలో భాగంగా 14 మందికి కుట్టు మిషన్లు, సైకిళ్లు, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వెట్ గ్రైండర్లు అందజేశారు. మరో 18 మందికి అమృత కలశాలు పంపిణీ చేశారు. అల్పాహారం, అన్నప్రసాద వితరణతో పాటు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అదువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. వారికి సంస్థ తరపున శేషవస్త్రం, జ్ఞాపిక అందజేశారు.సాయంత్రం బాలవికాస్ పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత విభావరి, డోలోత్సవం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్‌తో పాటు సంస్థ సభ్యులు, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

విమర్శలకు హద్దులు ఉండాలి స్థాయిని దిగజార్చుకోవడం తగదు: కాంగ్రెస్ నేతలు



జగిత్యాల, నవంబర్ 23 (ప్రజా మంటలు): రాజకీయాల్లో విమర్శలు హుందాగా, సహేతుకంగా ఉండాలని, హద్దులు దాటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని మోతే పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చేయూత పెన్షన్లపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ నేత, గీత కార్మికుల పెన్షన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వాటా అందించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సమంజసం కాదన్నారు. రాజకీయాల్లో మహిళలు హుందాగా, సంస్కారవంతమైన భాషను ఉపయోగించాలని సూచించారు.జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, సీనియర్ నాయకుడు బండ శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై భోగ శ్రావణి చేస్తున్న ఆరోపణలను ఖండించారు. నేత, గీత కార్మికుల పెన్షన్ పథకాలను వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు.సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుమాల రాజ్ కుమార్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేవంత్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో హామీలకే పరిమితం: ఎల్. రమణ



జగిత్యాల, నవంబర్ 23 (ప్రజా మంటలు): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ ఎల్. రమణ విమర్శించారు. జగిత్యాలలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై ఆయన మాట్లాడారు.నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడం లేదన్నారు.చేనేత కార్మికులకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా అందించిన పెన్షన్లకు ప్రస్తుతం మెడికల్ సర్టిఫికెట్లు కోరడం, పెన్షన్లను తగ్గించే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, బోనస్ విషయంలోనూ ప్రభుత్వం రైతులను నిరాశపరిచిందని విమర్శించారు.గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించి నీటిని వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు, కార్మికులు, యువత, విద్యార్థుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని, ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇమ్మానేని రేవతి మృతి పట్ల సంతాపం

26న వైకుంఠ సమారాధన



సికింద్రాబాద్, నవంబర్ 23 (ప్రజా మంటలు): ప్రముఖ సామాజిక సేవకురాలు, విద్యావేత్త మాతృమూర్తి ఇమ్మానేని రేవతి అకాల మూర్తి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఈ నెల 13న అనారోగ్యంతో ఆమె స్వర్గస్తులైనారు. వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని ఈ నెల 26 గురువారం రోజున పద్మారావు నగర్ వాకర్ టౌన్ లోని తమ స్వగృహం 6-1-344/8 లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నిర్వహించనున్న ఈ వైకుంఠ సమారాధన కార్యక్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొనాలని జ్యేష్ఠ పుత్రుడు, హైకోర్టు న్యాయవాది రామారావు ఇమ్మానేని, కనిష్ఠ కుమారుడు ఇమ్మానేని రంగస్వామి, కుమార్తెలు ఎం.రమణి, భవాని, మనుమలు, మనుమరాండ్లు, కోడళ్ళు, అల్లుళ్ళు,ఇతర కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ఎల్కతుర్తిలో మండల సమన్వయ సమావేశం

ఈ నెల 27న ఉదయం 11 గంటలకు సమావేశం



ఎల్కతుర్తి నవంబర్ 23 (ప్రజా మంటలు : హన్మకొండ జిల్లా, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మండల కార్యాలయంలో ఈ నెల 27-11-2026 (శుక్రవారం) ఉదయం 11 గంటలకు మండల సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీ డి. ఆదిరెడ్డి తెలిపారు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి మండల సర్పంచులు మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఇందులో భాగంగా మండల ప్రత్యేక అధికారి శ్రీ డి. ఆదిరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశానికి ఎల్కతుర్తి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎల్కతుర్తి మండల ప్రత్యేక అధికారి విజయ్ కుమార్ కోరారు

అనుమతులు లేకుండా విశ్వబ్రాహ్మణ సంఘం పేరిట షెడ్ నిర్మాణం

టింబర్ డిపో పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం బాధ్యులకు గ్రామపంచాయతీ నోటీసులు



ఎల్కతుర్తి, నవంబర్ 23 (ప్రజా మంటలు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గ్రామపంచాయతీ పరిధిలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం చేపట్టడం స్థానికంగా కలకలం రేపుతోంది. టింబర్ డిపో, ప్లైవుడ్ షాపు ఏర్పాటు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం పూర్తి చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.షెడ్ నిర్మాణానికి విద్యుత్ అధికారిక కనెక్షన్ లేకుండానే విద్యుత్ వినియోగించినట్లు కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై గ్రామస్థులు గ్రామపంచాయతీ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో స్పందించిన గ్రామ కార్యదర్శి నిర్మాణ బాధ్యులకు నోటీసులు జారీ చేశారు. అనుమతులు సమర్పించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.మరోవైపు, ఎల్కతుర్తి మండల విశ్వబ్రాహ్మణ సంఘం అనుమతి లేకుండా, మరో మండలానికి చెందిన వ్యక్తి ఇక్కడ షాపు ఏర్పాటు చేయడంపై సంఘం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంఘం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ షాపు నిర్వహిస్తానని ప్రకటించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.అయితే, నిర్మాణ అనుమతులు, విద్యుత్ వినియోగం, షాపు నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చేనేత పింఛన్ల కోసం పద్మశాలీల సమరశంఖం!

పార్టీలకతీతంగా ఒక్కటైన పద్మశాలీలు కలెక్టరేట్‌కు భారీగా తరలివెళ్లి కలెక్టర్‌కు వినతి

అర్హులకు పింఛన్లు మంజూరు చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు : పద్మశాలీ సంఘాల హెచ్చరిక



గొల్లపల్లి నవంబర్ 23 ప్రజా మంటలు : చేనేత వృత్తినే నమ్ముకొని తరతరాలుగా జీవనం సాగిస్తున్న పద్మశాలీలకు పింఛన్ల మంజూరులో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ పద్మశాలీలు పోరుబాట పట్టారు. అర్హులైన చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలానికి చెందిన పద్మశాలీల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ గ్రామల పద్మశాలీ బంధువులు పార్టీలకతీతంగా ఏకమై పెద్ద సంఖ్యలో జిల్లా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా పద్మశాలీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకొని పద్మశాలీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, నేటికీ ఉపాధి కోసం సిరిసిల్ల, భీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లి కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. అలాంటి చేనేత వృత్తిదారులకు పింఛన్లు మంజూరు చేసే విషయంలో ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. ఇతర అర్హుల మాదిరిగానే పద్మశాలీలకు కూడా న్యాయం జరగాలని, పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.గొల్లపల్లి మండల పద్మశాలీ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి కస్తూరి సత్యం, అంకం భూమయ్య వివిధ గ్రామాల పద్మశాలీ సంఘాల అధ్యక్షులు, కుల బంధువులు ఒకే వేదికపైకి వచ్చి పద్మశాలీల ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా 'పద్మశాలీల ఐక్యత వర్ధిల్లాలి.. చేనేత పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి' అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ఇది కేవలం ఒక మండలానికి సంబంధించిన సమస్య కాదని, చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అర్హులైన కుటుంబాల జీవనాధారానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు.

పింఛన్లు మంజూరు చేయకపోతే ఉద్యమం ఉధృతం!

అర్హులైన పద్మశాలీ కులస్తులకు తక్షణమే చేనేత పింఛన్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని సంఘాల నాయకులు హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా పద్మశాలీ కుల బంధువులంతా ఐక్యంగా నిలబడి తమ హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.ఎన్నికల సమయంలో పద్మశాలీల ఓట్లను కోరే వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు.. ఇప్పుడు పద్మశాలీ కులస్తులకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి పద్మశాలీల సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. పద్మశాలీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని మండల పద్మశాలీ సంఘం అధ్యక్షులు, వివిధ గ్రామాల పద్మశాలీ సంఘాల అధ్యక్షులు, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన పద్మశాలీ కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తున్న టిప్పర్ లారీ ట్రాక్టర్ పట్టివేత



ఎల్కతుర్తి నవంబర్ 23 ప్రజా మంటలు : ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తురుకదానికుంటలో అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న టిప్పర్ లారీతో పాటు, అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎల్కతుర్తి ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారుఈ సందర్భంగా అక్రమంగా మొరం, ఇసుక తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు ఎల్కతుర్తి ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ శంకర్, పోలీసు సిబ్బంది వాహనాలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి గుండాల వంశీకుమార్, నీరటి లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.కరీంనగర్ జిల్లా వీనవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేశవేణి వెంకటేష్, రంజిత్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిసింది అక్రమంగా ఇసుక, మొరం తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు

భక్త మార్కండేయ ఆలయ భజన కార్యక్రమంలో పాల్గొన్న జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల నవంబర్ 23 (ప్రజా మంటలు) : పట్టణంలోని అంగడి బజార్‌లో గల శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న భజన కార్యక్రమానికి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అదువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి కుల బాంధవులు ఆమెను శాలువాతో చిరు సత్కారం చేసి ఘనంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల పెద్దలు, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంబర్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం



సికింద్రాబాద్, నవంబర్ 23 (ప్రజా మంటలు): బౌద్ధ నగర్ డివిజన్ లోని అంబర్ నగర్ బస్తీలో డ్రైనేజీ నిండి మురుగునీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ మంద జగన్ వెంటనే అక్కడికి చేరుకుని డ్రైనేజీని శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబర్ నగర్ ఉపాధ్యక్షుడు చింతకింది సాయి కిరణ్, సత్యనారాయణ, శంకర్, రమేష్, రాములు, దిండిగల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఉచిత న్యాయ సలహాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

గొల్లపల్లి నవంబర్ 23 ప్రజా మంటలు : ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ న్యాయ సేవల అధికారి శ్రీ నివాస్ యాదవ్ చే విద్యార్థులందరికీ న్యాయపరమైన సలహాలు సూచనలు వివరించారు ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవల అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో జరిగే అనేక సంఘటనలపై విద్యార్థులుగా మీరు పరిజ్ఞానం కలిగి ఉండాలని, ముఖ్యంగా బాలురు గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాలికలు అపరిచిత మొబైల్ కాల్స్ పట్ల మరియు సైబర్ క్రైమ్, పొక్సో యాక్ట్, చైల్డ్ లేబర్ తదితర సామాజిక అంశాలపై విద్యార్థులకు ఉపయోగపడు అనేక విషయాలను కులంకషంగా తెలియజేశారా విద్యార్థులుగా మీ వంతు హక్కులను పొందుతూ మీ వంతు బాధ్యతగా వ్యవహరించాలని అవసరం ఉంది అని తెలిపారు.ఏదైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే 15100 ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ ని సంప్రదించి పరిష్కారం పొందవచ్చు అని చెప్పారు. పేద,మధ్యతరగతి అనే తేడా లేకుండా అందరికీ ఉచితంగా న్యాయ సేవలు అందించడానికి ప్రతి జిల్లాలో ప్రభుత్వ న్యాయ సేవా అధికారులు ఉంటారని వారిని నిర్భయంగా మీరు సంప్రదించవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా న్యాయ సేవల అధికారి శ్రీనివాస్ యాదవ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజు కుమార్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు విద్యాశాఖ కమిషనర్ అభినందన



సికింద్రాబాద్, నవంబర్ 23 (ప్రజా మంటలు): సికింద్రాబాద్ మండలం భోలక్‌పూర్ కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు జి.స్వరూపను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. 700 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. ఇటీవల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో విద్యార్థుల నమోదు, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, అభివృద్ధి కమిటీ సహకారంతోనే ఇది సాధ్యమైందని హెచ్ఎం స్వరూప పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడతలో గుంటభూమిలేని నీరుపేదలకే



భీమదేవరపల్లి, నవంబర్ 23(ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను, మండల అధికారులను డిమాండ్ చేసిన గట్లనర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ గారు.ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు సమాజంలో అర్థికంగా ఉన్నవారికి ఇండ్లు కేటాయించి ప్రభుత్వం పైన వ్యతిరేఖత వచ్చె విధంగా వ్యవహరించవద్దని నాయకులకు సూచించారు.. ఆర్థికంగా లేని నిస్సహాయక కుటుంబాలను గుర్తించి ఇండ్లను కేటాయిస్తే నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందనీ, లేకుంటే గ్రామాల్లో తిరుగనివ్వరని,రెండో విడతలో భూమి ఉన్నవారికి ఇండ్లను కేటాయిస్తే గ్రామ ప్రజలతో పెద్దఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

యువజన కాంగ్రెస్ నేత సాయికుమార్ జన్మదిన వేడుకలు



సికింద్రాబాద్, నవంబర్ 23 (ప్రజా మంటలు): సికింద్రాబాద్ నియోజకవర్గం నీతాఫల్‌మండి డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయికుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దాడిగ సందీప్ రాజ్ కేక్ కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ జన్మదినంతో సాయికుమార్ జీవితంలో కొత్త వెలుగులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అటుకుల శ్రీనివాస్ రెడ్డి



భీమదేవరపల్లి: నవంబర్ 23 (ప్రజామంటలు): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సంగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ అటుకుల శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో డీటీఎఫ్‌కు సభ్యత్వం లభించిన నేపథ్యంలో, రిటైర్ అయిన వారి స్థానంలో నూతన కార్యవర్గ ఎన్నిక కోసం హైదరాబాద్ టీఎన్జీవో భవన్‌లో రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో శ్రీనివాస్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.1995లో ఉపాధ్యాయుడిగా చేరిన ఆయన, గతంలో మండల, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి హోదాలతో పాటు 'అధ్యాపక జ్వాల' సంపాదకుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. శ్రీనివాస్ రెడ్డి ఎన్నికపై రాష్ట్ర కౌన్సిలర్ డోరి రమేష్, సీనియర్ నేత ఎన్. భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రవీందర్, మాడుగుల నవీన్ కుమార్‌తో పాటు నాయకులు రమణారెడ్డి, అశోక్ కుమార్, విజయకుమార్, సంపత్, రాజ్ కుమార్, ఉపాధ్యాయినులు స్రవంతి, ఉమ, షహన, స్వర్ణలత, కవిత, సంధ్య, మౌనిక, శాంత తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

ఎస్ఐఆర్‌పై అవగాహన పాదయాత్రలో పాల్గొన్న ఎల్కతుర్తి బీజేపీ శ్రేణులు

కరీంనగర్‌లో బండి సంజయ్ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర.. 400 మంది కార్యకర్తల హాజరు



ఎల్కతుర్తి, నవంబర్ 23 (ప్రజా మంటలు): కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్రలో ఎల్కతుర్తి మండలానికి చెందిన సుమారు 400 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు హాజరయ్యారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెప్పడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ పాదయాత్ర నిర్వహించారు.ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మంతురి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పాదయాత్ర విజయవంతానికి కృషి చేసిన గ్రామ, బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రైనీ డీఎస్పీలకు 24 వారాల క్షేత్రస్థాయి శిక్షణ



జగిత్యాల, నవంబర్ 23 (ప్రజా మంటలు): పోలీసింగ్ విధానాలు, విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహనతో పాటు క్షేత్రస్థాయి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా శిక్షణ పొందాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ట్రైనీ డీఎస్పీలకు సూచించారు. 24 వారాల ప్రాక్టికల్ శిక్షణ కోసం జిల్లాకు కేటాయించబడిన ట్రైనీ డీఎస్పీలు తేజస్విని, నరేందర్ ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ

జోరుగా భూముల కేటాయింపులు ప్రాజెక్టులు ప్రారంభించడమే లక్ష్యంగా అడుగులు

ఎస్ ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల కోసం 28 వేల 832 ఎకరాలు అవసరమని ఏపీఐఐసీ గుర్తించింది. ఇప్పటికే 10 వేల 389 ఎకరాలను పరిశ్రమలకు అప్పగించింది.పరిశ్రమల ఏర్పాటుకు భూముల కేటాయింపులో ప్రభుత్వం వేగం పెంచింది. పెట్టుబడులకు అనుగుణంగా భూసేకరణ, భూముల అప్పగింత ప్రక్రియలను పరుగులు పెట్టిస్తోంది. ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల కోసం 28 వేల 832 ఎకరాలు అవసరమని ఏపీఐఐసీ గుర్తించింది. ఇప్పటికే 10 వేల 389 ఎకరాలను పరిశ్రమలకు అప్పగించింది. గత రెండేళ్లలో పరిశ్రమలకు కేటాయించిన భూములే గత దశాబ్దకాలంలో జరిగిన మొత్తం కేటాయింపుల్లో 37 శాతంగా ఉన్నాయి.3 జిల్లాల వాటా 91 శాతం: రాష్ట్రంలోప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో ప్రారంభించడమే లక్ష్యంతో జిల్లాల వారీగా భూముల కేటాయింపులు జోరందుకున్నాయి. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా 4 వేల 524 ఎకరాలు పరిశ్రమలకు అప్పగించారు. అనకాపల్లిలో 3 వేల 98, నెల్లూరులో వెయ్యి 872 ఎకరాలు కేటాయించారు. ఈ మూడు జిల్లాల్లోనే మొత్తం 9 వేల 494 ఎకరాలు పరిశ్రమలకు అందించారు. అంటే ఇప్పటివరకు అప్పగించిన భూముల్లో ఈ మూడు జిల్లాల వాటా 91 శాతం.చిత్తూరు జిల్లాలో 312, శ్రీసత్యసాయి జిల్లాలో 130, తిరుపతిలో 46 ఎకరాలు వివిధ ప్రాజెక్టులకు కేటాయించారు. ఫార్మాస్యూటికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, ఇంజినీరింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు ఈ భూములను వినియోగించనున్నారు. పారిశ్రామిక



అవసరాల కోసం భూసేకరణను కూడా ఏపీఐఐసీ వేగవంతం చేసింది. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 88 వేల 955 ఎకరాల సేకరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో పది జిల్లాల్లోని ప్రాజెక్టులకు 28 వేల 832 ఎకరాలు అవసరం.గత రెండేళ్లలో జరిగిన భూసేకరణలో ఐదు జిల్లాలు కీలకంగా నిలిచాయి. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా 5 వేల 790 ఎకరాలు సేకరించారు. అనకాపల్లిలో 3 వేల 152, కర్నూలులో 2 వేల 517 ఎకరాలు సమకూర్చారు. శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో 1,600 ఎకరాల చొప్పున సేకరించారు. ఈ ఐదు జిల్లాల్లోనే 15 వేల 320 ఎకరాలు అందుబాటులోకి తెచ్చారు.నీటి సరఫరా లైన్: 2024 జూన్ నుంచి ఇప్పటివరకు సేకరించిన భూముల్లో ఇది 62 శాతం. పరిశ్రమల స్థాపనకు భూములు సిద్ధం చేయడంలో ఏపీఐఐసీ అనుసరిస్తున్న వేగానికి పలు ప్రాజెక్టులు ఉదాహరణగా నిలుస్తున్నాయి. కర్నూలు జిల్లాలో రిలయన్స్ బెవరేజెస్ ప్రాజెక్టుకు భూసేకరణ, భూవినియోగ మార్పిడి, భూముల అప్పగింత, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసింది. ప్రాజెక్టుతో పాటు పరిసర పారిశ్రామిక ప్రాంత అవసరాల కోసం 13.3 కిలోమీటర్ల నీటి సరఫరా లైన్ కూడా ఏర్పాటు చేసింది.అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు 5 వేల 465 ఎకరాలు అందించింది. దీంతో 16 నెలల్లోనే ప్రాజెక్టు గ్రౌండింగ్ సాధ్యమైంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమైన 601 ఎకరాలను అప్పగించింది. 2024 సెప్టెంబరులో గూగుల్‌తో సంప్రదింపులు ప్రారంభం కాగా 2026 ఏప్రిల్‌లో ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటుపైనా ఏపీఐఐసీ దృష్టి సారించింది.ఈ ప్రాజెక్టుకు మొత్తం 6 వేల ఎకరాలు అవసరమని ప్రతిపాదించగా ఇప్పటికే 4 వేల 490 ఎకరాలు సంస్థకు అప్పగించింది. పెట్రోలియం పార్కు అభివృద్ధి కోసం మరో 907 ఎకరాల భూసేకరణ కొనసాగిస్తోంది. ఇలా ప్రధాన పెట్టుబడి ప్రాజెక్టులకు అవసరమైన భూములను సమకూర్చడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తూ పరిశ్రమల ఏర్పాటును అమలు దశలోకి తీసుకెళ్తోంది.

భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీకి ఎక్స్‌ప్రెస్ రైళ్లతో చెక్ రూ.50 కంటే తక్కువ ధర, 2 గంటల సమయం ఆదా

హైదరాబాద్‌లో సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య తగ్గిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ సమయాన్ని ఆదా చేసేందుకు కూడా ఈ రైలు సేవలను వినియోగి స్తున్నారు.హైదరాబాద్ మహానగరంలో వాహనాల రద్దీ పెరుగుతుం డటంతో ఐటీ ఉద్యోగులతోపాటు సామాన్య ప్రయాణికులు రోడ్లపైనే విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. నగరంలోని సబర్బన్ రైలు నెట్‌వర్క్, ప్రధాన స్టేషన్లలో ఆగే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపుతున్నాయి. నగరంలో ప్రస్తుతం 80కి పైగా లోకల్, సబర్బన్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు కీలక స్టేషన్లలో ఆగే ఇంటర్‌సిటీ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు పెద్ద ఎత్తున ప్రయాణ సమయాన్ని తగ్గిస్తున్నాయి.టికెట్ ధరలు రూ.50 లోపే ఉండటంతోపాటు ట్రాఫిక్ సమస్య లేకుండా రోజుకు కనీసం రెండు గంటల సమయాన్ని ఆదా చేసుకునేందుకు ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైలు కనెక్టివిటీ ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యంగా మారింది. అయితే స్టేషన్ నుంచి గమ్యస్థానానికి సులభంగా చేరుకునేందుకు లాస్ట్ మైల్ కనెక్టివిటీ కూడా మెరుగుపరిస్తే ప్రయాణికులకు మరింత ఉపశమనం లభిస్తుందని ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

రోడ్డుమార్గంతో పోలిస్తే సుమారు 60 నిమిషాలు ఆదా

ఎంఎంటీఎస్ రైళ్లు ప్రతి చిన్న స్టేషన్‌లోనూ ఆగుతాయి. దీని ద్వారా కొంత మేరకు ప్రయాణ సమయం పెరుగుతుంది. అదే ప్రధాన జంక్షన్లలో మాత్రమే ఆగే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తే 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని ఆదా చేయొచ్చు. రోడ్డుమార్గంతో పోలిస్తే ఈ రైళ్ల ద్వారా 30 నుంచి 60 నిమిషాల సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం లింగంపల్లి – బేగంపేట – సికింద్రాబాద్ మార్గంలో సుమారు 20 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, చర్లపల్లి – సికింద్రాబాద్ మార్గంలో 15, అలాగే కాచిగూడ – బొల్లారం మార్గంలో 10, ఫలక్‌నుమా నుంచి ఉమ్దానగర్ వెళ్లే మార్గంలో 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి.

30 నిమిషాల్లోపే సికింద్రాబాద్ నుంచి లింగంపల్లికి

సికింద్రాబాద్ నుంచి బేగంపేట మీదుగా లింగంపల్లికి సుమారు 23 కి.మీ దూరం ఉంటుంది. ఈ మార్గంలో ప్రయాణించడానికి రద్దీ సమయాల్లో కనీసం గంటన్నర సమయం పడుతోంది. సాధారణ ఎంఎంటీఎస్ రైళ్లో అయితే 40 నుంచి 45 నిమిషాల్లో పూర్తి చేయొచ్చు. ఇక సికింద్రాబాద్ నుంచి బయలుదేరి బేగంపేట, లింగంపల్లి స్టేషన్లలో మాత్రమే ఆగే ఎక్స్‌ప్రెస్ లేదా ఇంటర్‌సిటీ రైళ్లో ప్రయాణిస్తే కేవలం 25 నుంచి 30 నిమిషాల్లోనే గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు.

తూర్పు నుంచి పడమర వరకు

ఘట్‌కేసర్, చర్లపల్లి మీదుగా లింగంపల్లికి అంటే నగరంలో ఒక చివర నుంచి మరో చివరకు సుమారు 40 కి.మీ. దూరం ప్రయాణించాలంటే బస్సులో లేదా ప్రైవేట్ వాహనంలో దాదాపు



రెండున్నర గంటల సమయం పడుతుంది. సబర్బన్ లింక్ సర్వీసులు లేదా ప్రధాన స్టేషన్లలో ఆగే రైళ్లలో వెళ్తే ఇదే ప్రయాణాన్ని ఒక గంట పదిహేను నిమిషాల సమయంలోపే పూర్తిచేయొచ్చు.

టికెట్లు తీసుకునేటప్పుడు ఇవి గమనించాలి

ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణించడానికి సాధారణ సబర్బన్ టికెట్ ఉంటే సరిపోతుంది. అయితే ఎక్స్‌ప్రెస్ లేదా ఇంటర్‌సిటీ రైళ్ల కోసం మాత్రం తప్పనిసరిగా అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్ కొనుగోలు చేయాలి.టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలలో వేచి ఉండే సమయం వృథా చేసుకోకుండా ఆన్‌లైన్‌లో లేదా స్టేషన్లలో అందుబాటులో ఉండే ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మెషీన్‌ల ద్వారా టిక్కెట్లు కొనుక్కోవచ్చు

హైదరాబాద్‌లో ముగిసిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ - 2027 వేదికగా కోల్‌కతా

హైదరాబాద్ హైటెక్ సిటీ వేదికగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సమావేశం నేటితో ముగిసింది.నాలుగు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సమావేశాల్లో కీలక అంశాలపై చర్చలు జరిగాయి. తాజా సాంకేతికతలను ఉపయోగించి మరింత సురక్షితమైన, సుస్థిరమైన, మన్నికైన రహదారి మౌలిక సదుపాయాల నిర్మాణంపై దృష్టి సారిస్తూ 19 సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. రోడ్లు, వంతెనల నిర్మాణం, నిర్వహణ, ప్రమాదాల తగ్గింపుకు సంబంధించిన తాజా పరిష్కారాలను ప్రదర్శించే టెక్నాలజీని ఐఆర్‌సీలో ప్రదర్శించారు. తెలంగాణ వారసత్వం, సంస్కృతిని చాటిచెప్పే సాంస్కృతిక కార్యక్రమాలు ఐఆర్‌సీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరిరోజున ఐఆర్‌సీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది ఐఆర్‌సీ వార్షిక సమావేశాలను పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో నిర్వహించాలని సంస్థ నిర్ణయించింది.హైదరాబాద్ హైటెక్ సిటీ వేదికగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సమావేశం నేటితో ముగిసింది. దేశ, విదేశాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని రహదారి మౌలిక సదుపాయాల భవిష్యత్తు, ఇంజినీరింగ్‌లో నూతన ఆవిష్కరణలు, రహదారి భద్రత, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఐఆర్‌సీలో 19 సాంకేతిక సమావేశాలు, రహదారి నిర్మాణ రంగంలోని తాజా ఉత్పత్తులు, సాంకేతికతలు, పరిష్కారాలను ప్రదర్శించారు. 400కు పైగా స్టాళ్లతో కూడిన సాంకేతిక ఎక్స్‌పోను



ఏర్పాటు చేశారు. అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, పరిచయం చేసే ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. నోరూరించే 90 రకాల వంటకాలను అతిథులకు వడ్డించారు.

19 సాంకేతిక సమావేశాలు

నాలుగు రోజుల వార్షిక సమావేశంలో రహదారి భద్రత, నిర్మాణ సామగ్రి, సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారి నిర్మాణంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వినియోగం వంటి విస్తృత అంశాలపై 19 సాంకేతిక సమావేశాలు జరిగాయి. రహదారి రంగానికి చెందిన నిపుణులు పరిశోధనా పత్రాలను సమర్పించడంతో పాటు, భారతదేశ రహదారి నెట్‌వర్క్ భద్రత, నాణ్యత, మన్నిక, సుస్థిరతను మెరుగుపరిచే లక్ష్యంతో తమ అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలను పంచుకున్నారు.సమావేశ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు హాజరయ్యారు. ఐఆర్‌సీలో సాంకేతిక ప్రదర్శన ప్రత్యేక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అందులో ఆధునిక సాంకేతికతలు, వినూత్న నిర్మాణ పరిష్కారాలు, రహదారి అభివృద్ధి సామర్థ్యాన్ని, వేగాన్ని పెంచగల సుస్థిర పదార్థాలను ప్రదర్శించారు. దీంతోపాటు మరింత సురక్షితమైన, ప్రతికూల పరిస్థితులను తట్టుకోగల, సుస్థిర రహదారి మౌలిక సదుపాయాల నిర్మాణానికి దోహదపడే అభివృద్ధి చెందుతున్న పరిష్కారాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

సాంస్కృతిక గుర్తింపు పరిచయం

తెలంగాణ వారసత్వం, సంప్రదాయాలను తెలియజేసేవిధంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తద్వారా దేశ నలుమూలల నుంచి వచ్చిన సందర్శకులకు రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన సాంస్కృతిక గుర్తింపును పరిచయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్టులు, కార్యక్రమాలను వివరించే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర రహదారి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రయత్నాలను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని అధికారులు తెలిపారు.

తిరుపతిలో మరో కొత్త నగరం.. అలిపిరి వద్ద రూ.2,750 కోట్లతో మెగా టౌన్‌షిప్

తిరుపతిలో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ ఏర్పాటుకు ఆమోదం

డిసెంబర్ 20 నుంచి 29 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు

సామాన్య భక్తులకు 92 శాతం దర్శన సమయం కేటాయింపు

రూ.7.5 కోట్లతో 500 నాటు ఆవుల కొనుగోలుకు నిర్ణయం

అలిపిరి నడక మార్గంలో కేబుల్ బ్రిడ్జిపై ఐఐటీ నిపుణులతో అధ్యయనం

తిరుపతిలోని అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డులోని స్థలంలో అత్యాధునిక సదుపాయాలతో పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవాణి ట్రస్ట్ నిధుల నుంచి రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో దీనిని చేపట్టనున్నారు. తిరుపతికి వచ్చే భక్తులకు ఒకేచోట మెరుగైన వసతి, ఆధునిక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్), డిజైన్లు, పనుల పర్యవేక్షణ కోసం అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీని నియమించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రణాళికా దశలోనే ఉంది.

డిసెంబర్ 20 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు

ఈ ఏడాది డిసెంబర్ 20 నుంచి 29 వరకు మొత్తం 10 రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. ఈ పది రోజుల్లో సుమారు 8.34 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 51 వేల మందికి అదనంగా దర్శన భాగ్యం కల్పించనుండటం విశేషం. మొత్తం దర్శన సమయంలో 92 శాతం సమయాన్ని సాధారణ భక్తులకే కేటాయించాలని నిర్ణయించారు.మొదటి రెండు రోజులైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో ఉచిత సర్వదర్శనం ఉండదు. కేవలం ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే ఎస్ఎస్‌డీ టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. మిగిలిన ఎనిమిది రోజులు సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుంది. అయితే ఈ ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో ఎప్పుడు విడుదల చేస్తారనే తేదీని టీటీడీ ఇంకా ప్రకటించలేదు.

టీటీడీ మరికొన్ని కీలక నిర్ణయాలు

గో సంరక్షణ: ఆలయంలో నిత్య కైంకర్యాలు, శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన స్వచ్ఛమైన పాలు, నెయ్యిని స్థానికంగానే ఉత్పత్తి చేసేందుకు రూ.7.5 కోట్ల వ్యయంతో 500 దేశీయ ఆవులను



సంరక్షణ కోసం అటవీశాఖకు రెండేళ్ల కాలానికి రూ.16.4 కోట్లు విడుదల చేయడానికి ఆమోదం తెలిపారు.విద్య, వైద్య రంగాలు: స్విమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి అదనంగా రూ.41.23 కోట్లు మంజూరు చేశారు. ఆయుర్వేద కళాశాలలో అదనంగా 20 బీఏఎంఎస్ సీట్లను పెంచనున్నారు. అలిపిరి సమీపంలోని శిల్పకళా కళాశాలలో 229 మంది విద్యార్థుల వసతి కోసం రూ.23 కోట్లతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు.కేబుల్ బ్రిడ్జి అధ్యయనం: అలిపిరి కాలినడక మార్గంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వైపు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఐఐటీ నిపుణులతో సమగ్ర అధ్యయనం చేయించాలని బోర్డు నిర్ణయించింది.

చేవెళ్లలో దొంగతనం ఫిర్యాదు చేసిన మహిళ హత్య: 24 గంటల్లో నిందితుడి అరెస్ట్

ఫోన్ దొంగతనంపై ఫిర్యాదు చేశారనే కోపంతో దారుణం

నిందితుడు 19 ఏళ్ల కేశావత్ శివశంకర్ అరెస్ట్

అతడి నుంచి సెల్‌ఫోన్, హత్యకు వాడిన కత్తి స్వాధీనం

నిందితుడిపై గతంలో ఏపీలోనూ దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తింపు

తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కక్షతో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన 19 ఏళ్ల యువకుడిని చేవెళ్ల పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్ దొంగతనంతో పాటు బ్యాంక్ ఖాతా నుంచి నగదు బదిలీ చేసిన వ్యవహారం ఈ హత్యకు దారితీసింది. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన కేశావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ (19), బాతుల గురువులు అనే వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించాడు. అనంతరం బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 45,000 నగదును తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన గురువులు,



పద్మ అనే మహిళతో కలిసి ఈ నెల 21న చేవెళ్ల పోలీసులకు శివపై ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసే సమయంలో పద్మ కూడా ఉండటంతో శివ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజామున చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డు వద్ద పద్మపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సాయంతో కేవలం 24 గంటల్లోనే నిందితుడు శివను పట్టుకున్నారు. నిందితుడిపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని వెలుగోడు పోలీస్ స్టేషన్‌లో రెండు దొంగతనం కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

బంగాళాఖాతంలో మరో రెండు తుపాన్లు ఏపీతో పాటు ఒడిశా, తమిళనాడుకు ముప్పు



ఇటీవలి రెండు తుపాన్లు రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని మిగి ల్చాయి. అక్టోబరు నెలాఖరులో అర్నబ్, నవంబరు 1న మురసు పెను ప్రభావం చూపాయి. బంగాళాఖాతంలో మరో రెండు తుపాన్లు ఇప్పటికే రెండు తుపాన్లు రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని మిగల్చగా మరో రెండు తుపాన్ల ముప్పు పొంచి ఉందని వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఈ నెలాఖరుకు బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డిసెంబరు మొదటి వారం తర్వాత మరో తుపాను ఏర్పడవచ్చని చెబుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇంకొకటి(మూడో తుపాను) ఏర్పడినా ఆశ్చర్యపోనవసరం లేదని ఏయూ వాతావరణ విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు తెలిపారు.ఉష్ణోగ్రతలు పెరిగితే దక్షిణ బంగాళాఖాతంలో ఉష్ణోగ్రతలు పెరిగితే అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడతాయని చెప్పారు. సముద్రంపై ఆవరించిన రుతుపవనాలు తేమను గ్రహించటంతో అల్పపీడనాలకు అవకాశముందన్నారు. ఇవి తుపాన్లుగా మారి ఏ దిశగా పయనిస్తాయనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. ఏపీతో పాటు ఒడిశా, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు ముప్పు తప్పదని పేర్కొన్నారు. తాజాగా మరో తుపాను ఏర్పడే అవకాశాలున్నాయన్న అంచనాలతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.వర్షాలతో వణికించిన మురసు సూపర్ ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రంలో జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాలు అంతంతమాత్రమే కురిశాయి. ఖరీఫ్ సీజన్‌ను కరవు కమ్మేసింది. వర్షాభావంతో పంటల సాగు తగ్గిపోగా, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికీ ఎద్దడి తప్పకపోవచ్చన్న సంకేతాలు వచ్చాయి. అక్టోబరు 26-29 మధ్య అర్నబ్ తుపాన్ బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు కుండపోత వర్షాలతో ముంచేసింది. యానాం సమీపంలో తీరం దాటిన ఈ తీవ్ర తుపానుతో వివిధ రంగాలకు సుమారు రూ.4,563 కోట్ల మేర నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. 16 జిల్లాల్లో 3.56 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిని, రూ.1,260 కోట్ల మేర పంటనష్టం వాటిల్లింది. ఇక, నవంబరు 3-7 వరకు అతిభారీ వర్షాలతో వణికించిన మురసు తుపాను 17 జిల్లాల్లో పెనుప్రభావం చూపింది. వివిధ రంగాలకు రూ.2,484 కోట్ల నష్టం చేసింది. 1.45 లక్షల హెక్టార్లలో పంటలు పాడై, రూ.1,200 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ఎన్నికల సంఘం అనుమతి



పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, విలీనానికి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి మంజూరు చేసింది. సిబ్బంది నియా మకం, ఎన్నికల నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకు ంది.గ్రామ పంచాయతీ ఎన్ని కల్లో అన్ని వార్డుల సభ్యుల స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు పూర్తై కేవలం సర్పంచ్ పదవికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాల్సిన పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, విలీనానికి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి మంజూరు చేసింది. పోలీసు, పోలింగ్ సిబ్బంది నియామకం, రవాణా ఇతర ఎన్నికల నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో ఈ నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది.విలీనం చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 650 మందికి మించరాదు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పోలింగ్ సిబ్బందిని నియమించాలి. ఒకే ప్రాంగణం లేదా ఒకే ప్రాంతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను మాత్రమే విలీనం చేయాలి. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలను విలీనం చేయరాదు. విలీనం చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి.పోలింగ్ కేంద్రాల విలీనంపై ఆయా ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు, పోటీలో ఉన్న అభ్యర్థులకు కూడా సమాచారం అందించాలి. ఈ మేరకు రాష్ట్రంలోని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు.

సరికొత్త టెక్నాలజీకి నాంది పలికిన టీజీఎస్ఆర్టీసీ 'ఐ-అలెర్ట్'తో ప్రతినెలా రూ.2 కోట్ల ఇంధనం ఆదా



ఇంధనం ఆదా, డ్రైవర్ల పనితీరు అంచనా వేయడానికి టీజీఎస్ఆర్టీసీ 'ఐ-అలెర్ట్' వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీంతో దేశంలోనే ఈ సాంకేతికతను తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా నిలిచింది.తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) సరికొత్త టెక్నాలజీకి నాంది పలికింది. ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, డీజిల్ పొదుపు పద్ధతులను ప్రోత్సహించడానికి బీఎస్-6 బస్సుల్లో 'ఐ-అలెర్ట్' వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఆర్టీసీ నిలిచింది. ఈ వ్యవస్థ ద్వారా నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గడంతో పాటు బస్సుల మొత్తం ఇంధన సామర్థ్యం మెరుగుపడిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ప్రతినెలా రూ.2 కోట్ల వరకు ఆదా

నిర్వహణ సక్రమంగా ఉంటే ఆర్థికంగా ఆదా చేయొచ్చని ఆర్టీసీ నిరూపించింది. బస్సుల్లో సురక్షిత ప్రయాణం, డీజిల్ పొదుపు పద్ధతులను ప్రోత్సహించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. డ్రైవింగ్‌లో డీజిల్ పొదుపు పద్ధతులను అమలుచేస్తూ బీఎస్-6 బస్సుల్లో ఐ-అలెర్ట్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ టెక్నాలజీని సమర్థంగా వినియోగించడం ద్వారా సంస్థ ఇప్పటివరకు సుమారు రూ.36 కోట్ల విలువైన హై స్పీడ్ డీజిల్ ఆయిల్‌ను ఆద